క్లుప్తంగా

శాంతారెడ్డికి పురస్కారం



స్టేషన్ మహబూబ్‌నగర్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారాన్ని జిల్లా కేంద్రంలోని న్యూటౌన్‌లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న ప్రముఖ రచయిత్రి జి.శాంతారెడ్డి అందుకున్నారు. నల్గొండలో ఆదివారం పుడమి సాహితీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాంతారెడ్డికి జ్ఞాపిక, శాలువా, ప్రశంసపత్రంతో సత్కరించారు. ప్రముఖులు కావూరి శ్రీనివాసశర్మ, కంచర్ల శ్రీనివాసరావు, వెంకట నాగేశ్వర్‌రావు, శివశంకరయ్య, పుడమి సాహితీ వేదిక అధ్యక్షుడు డాక్టర్ చిలుముల బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పురస్కారం రావడంపై న్యూటౌన్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినిని వేధించిన వారిపై కేసు

మిడ్జిల్: మండలపరిధిలోని ఓ ఇంటర్ విద్యార్థిని ముగ్గురు బాలురు వేధించడంతో బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపారు. వేధింపులకు పాల్పడిన వారిలో ఒక్కరు విద్యార్థిని చదివే కాలేజీ కాగా మిగిలిన వారు మహబూబ్‌నగర్, హైదరాబాద్‌లో ఇంటర్ చదువుతున్నారని అన్నారు. కాగా వేధింపులు భరించలేక విద్యార్థిని తండ్రికి సమాచారం ఇవ్వడంతో తమకు ఫిర్యాదు చేశారని వివరించారు.

నేడు లోకిరేవులో పూజలు

నవాబుపేట: శ్రావణ మాసం సందర్భంగా సోమవారం మండల పరిధిలోని లోకిరేవు వీరభద్రస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు పూజారి లింగయ్యస్వామి తెలిపారు. రుద్రాభిషేకం, ప్రత్యేక అలంకరణ, పుష్పార్చన కార్యక్రమాలు ఉంటాయని వివరించారు.

ఆర్థికసాయం

అడ్డాకుల: బలీదుపల్లికి చెందిన శ్రీను అనారోగ్యానికి గురై మరణించడంతో బాధిత కుటుంబాన్ని ఆదివారం బీఆర్‌ఎస్ నాయకులు పరామర్శించారు. మంత్రి నిరంజన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేస్తూ అంత్యక్రియల ఖర్చుల కోసం రూ.5వేలను పంపడంతో వాటిని బాధిత కుటుంబానికి అందజేశారు. శ్రీధర్‌యాదవ్, నర్సింహ, రాములు తదితరులు ఉన్నారు.

భూత్పూర్: మున్సిపల్ వైస్ చైర్మన్ కెంద్యాల శ్రీనివాస్ సుధాకర్ రెండు రోజుల క్రితం హార్ట్ ఎటాక్‌తో మృతిచెందగా ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబాన్ని ఆదివారం పరామర్శించారు. అదేవిధంగా కప్పెటకి చెందిన జాఫర్ ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందగా బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేల నగదు సాయం అందిచారు. మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్, ముడా డైరెక్టర్‌లు తదితరులు ఉన్నారు.

బ్రెయిన్‌స్ట్రోక్‌తో ఉపాధ్యాయుడు మృతి

గండీడ్: బ్రెయిన్ స్ట్రోక్‌తో ఓ ఉపాధ్యాయుడు ఆదివారం మృతి చెందాడు. వివరాలు ఇలా.. ఆంధ్రప్రదేశ్ శ్రీకాకుళం జిల్లా మందసకు చెందిన పి.శ్యాముల్‌రాజ్ (48) 2012లో నాన్ లోకల్ కెటగిరీలో ఉద్యోగం పొంది వెన్నాచేడ్ బాలుర ఉన్నత పాఠశాలలో ఫిజికల్ సైన్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. కాగా శనివారం మహబూబ్‌నగర్‌లోని ఇంట్లో ఉండగా ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. కాగా అప్పటికే కుమార్తెను పాఠశాల బస్సు ఎక్కించడానికి వెళ్లిన అతడి భార్య తిరిగి వచ్చే సరికి ఆయన మంచంపై నుండి కింద పడిపోయాడు. కాగా ఆమె స్థానికుల సహకారంతో శ్యాముల్‌రాజ్‌ను పట్టణంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించగా ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. సహచర ఉపాధ్యాయులు నివాళులు అర్పించారు.

హక్కులను సాధించుకుందాం

భూత్పూర్: ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకుందామని ముదిరాజ్ చైతన్య వేదిక రాష్ట్ర నాయకురాలు పుష్పలత అన్నారు. ఆదివారం భూత్పూర్ చౌరస్తాలో మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలోని నియోజక వర్గాలల్లో జరుగుతున్న ర్యాలీకి ముదిరాజ్‌లు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా పుష్పలత మాట్లాడుతూ రాష్ట్రంలో ముదిరాజులు 65 లక్షల మంది ఉన్నారని అన్నారు. జనాభా దామాషా ప్రకారం అసెంబ్లీలో ఎన్నికల్లో ముదిరాజులకు 30 సీట్లు కేటాయించాలని ఆమె పేర్కొన్నారు. ముదిరాజులను బీసీ-డి నుంచి బీసీ-ఏకు మార్చాలని, ముదిరాజ్ జాతికి జరుగుతున్న అన్యాయాలను ఎదురించాలని పేర్కొన్నారు. మల్లేష్, శ్రీను, మల్లేష్,తరుణ్‌రాజ్, పట్నం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దంచికొట్టిన వాన



కందూర్ స్టేజీ వద్ద పారుతున్న వరద

అడ్డాకుల: మూసాపేట మండలంలో వర్షం దంచికొట్టింది. శనివారం రాత్రి 8.30 గంటల నుంచి 10 గంటల వరకు ఏకధాటిగా కురవడంతో రోడ్లంతా జలమయమయ్యాయి. ఆదివారం ఉదయం వరకు వర్షం స్వల్పంగా కొనసాగింది. కాగా జానంపేట వర్షపాత కేంద్రంలో 147.5 మిల్లి మీటర్లుగా నమోదైనట్లు మండల వ్యవసాయాధికారి రాజేందర్‌రెడ్డి తెలిపారు. ఇంత భారీగా నమోదు కావడం ఇదే మొదటిసారన్నారు. కాగా వర్షానికి మండలంలో విస్తరించి ఉన్న పెద్దవాగుకు భారీగా వరద పోటెత్తింది. పోల్కంపల్లి నుంచి తాళ్లగడ్డ మీదుగా నిజాలాపూర్, కొమిరెడ్డిపల్లి వరకు వాగులో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. మూసాపేట, నిజాలాపూర్, సంకలమద్ది, అడ్డాకుల మండలంలోని గౌరిదేవిపల్లి వద్ద పెద్దవాగులో నిర్మించిన చెక్ డ్యాంలు నిండి అలుగు పారుతున్నాయి. కొమిరెడ్డిపల్లి చెక్‌డ్యాం నుంచి కొత్తగా ఏర్పాటు చేసిన కాలువ ద్వారా కొమిరెడ్డిపల్లి, పొన్నకల్, రాచాల చెరువులకు వరద నీరు వెళ్తోంది. పొన్నకల్, గుడిబండ, ముత్యాలంపల్లి, బలీదుపల్లి గ్రామాల శివారులో నిర్మించిన చెక్‌డ్యాంలు అలుగు పారుతున్నాయి.

కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయం

మూసాపేట మండల కేంద్రంలో శనివారం రాత్రి భారీ వర్షం కురవడంతో కరెంటు సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. శనివారం రాత్రి 9 గంటల నుంచి ఆదివారం ఉదయం వరకు కరెంటు సరఫరా నిలిచిపోయింది. మధ్య, మధ్యలో కొంత సమయం వచ్చినా అరగంట కూడా ఉండకుండా అంతరాయం కలిగింది. ఆదివారం మధ్యాహ్నం నుంచి కరెంటు సరఫరా కొనసాగింది. ఒకవైపు భారీ వర్షం, ఓవైపు కరెంటు లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

రాజాపూర్: మండల పరిధిలో ఆదివారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో అన్నదాత ముఖంలో ఆశలు చిగురించాయి. వర్షంతో పత్తి, జొన్న, మొక్కజొన్న వంటి పంటలకు జీవం పోసినట్లైందని వ్యవసాయశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కుంటను తలపిస్తున్న అండర్ బ్రిడ్జి



అడ్డాకుల: మూసాపేట మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి కొమిరెడ్డిపల్లి వద్ద రహదారి కింద ఉన్న అండర్ బ్రిడ్జి కుంటను తలపిస్తోంది. రహదారిని నాలుగు లైన్లుగా విస్తరించిన సమయంలో గ్రామంలో వాహనాల రాకపోకలకు అండర్ బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. అందులో నిలిచే నీళ్లు బయటకు వెళ్లడానికి సరైన ఏర్పాట్లు చేయలేదు. డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో వర్షం నీరు రోజుల తరబడి బ్రిడ్జిలోనే నిలుస్తోంది. నడిచి వెళ్లడానికి వీలు లేకుండా మారుతోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. రహదారి నిర్వాహకులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

వైఎస్సార్‌ను మరిపించే పాలకులే లేరు



నివాళులు అర్పిస్తున్న నాయకులు

మహబూబ్‌నగర్ రూరల్: మహానేత వైఎస్సార్‌ను మరిపించే పాలకులే లేరని పలువురు నాయకులు కొనియాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మల్లు కృష్ణారెడ్డి వర్ధంతులను పురస్కరించుకుని ఆదివారం మాచన్‌పల్లిలో వారి విగ్రహాలకు నాయకులు నివాళులు అర్పించారు. సర్పంచ్ మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీటీసీ నరేందర్‌రెడ్డి, నాయకులు మల్లు వెంకటేశ్వర్‌రెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, మల్లిక తదితరులు పాల్గొన్నారు.

మినీ స్టేడియానికి నిధులు మంజూరు: మంత్రి



ఉత్తర్వుల కాపీ అందజేస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: గ్రామీణ ప్రాంతాల్లోనూ అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను తయారుచేయడమే తమ లక్ష్యమని మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. హన్వాడలో మినీ స్టేడియం కోసం రూ.3.70 కోట్లు మంజూరయ్యాయన్నారు. ఈ మేరకు ఆదివారం రాత్రి హన్వాడ మండల ప్రజాప్రతినిధులు జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎంపీపీ బాలరాజు, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, ముడా డైరెక్టర్ కొండా బాలయ్య, సింగిల్‌విండో వైస్ చైర్మన్ కృష్ణయ్యగౌడ్, మండల కో–ఆప్షన్ సభ్యుడు మన్నన్ పాల్గొన్నారు.

హన్వాడ: మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం బుద్దారం గ్రామానికి చెందిన వెంకట్రాములుకు రూ.3లక్షలు ఎల్‌ఓసీ అందజేశారు. అంతకుముందు పలు వివాహ వేడుకలకు హాజరయ్యారు.

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): జిల్లా కేంద్రంలోని బోయపల్లిలో రెడ్డి ఫంక్షన్ హాల్ నిర్మాణం కోసం అర ఎకరా భూమి, రూ.1 కోటి నిధులను మంజూరు చేసినట్లు మంత్రి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. క్యాంపు కార్యాలయంలో సంఘం సభ్యులకు నిధుల మంజూరు ఉత్తర్వు కాపీని అందించారు. మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ మల్లు నరసింహారెడ్డి, సంఘం నాయకులు బుచ్చారెడ్డి, రామకృష్ణారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'జాతర' వ్యాపారాలన్నింటికీ టెండర్లు వేయాలి

చిన్నచింతకుంట: కురుమూర్తి జాతర ఉత్సవాలకు సంబంధించి నెలరోజుల పాటు కొనసాగే వ్యాపారాలన్నింటిపై అధికారులు టెండర్లు వేయాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నంబిరాజు డిమాండ్ చేశారు. ఆదివారం మాట్లాడుతూ టెండర్లు వేయకుండా వ్యాపారస్తుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేసుకుంటున్నారని ఆరోపించారు. కేవలం టెంకాయలు, లడ్డు, తలనీలాలు, కొబ్బరి చిప్పలు, సినిమా టాకీసులు, కరెంటుకు మాత్రమే టెండర్లు వేస్తున్నారన్నారు. ఇప్పటికైనా టెండర్లు స్వామివారి ఆలయానికి ఆదాయం సమకూర్చాలన్నారు.

పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి



మహమ్మదాబాద్‌లో మాట్లాడుతున్న ఆర్డీఓ



బస్వాపూర్‌లో..



గండేడ్‌లో..

మహమ్మదాబాద్: పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలను కల్పించేలా అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారీ తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో రెవెన్యూ అధికారులతో సమావేశమయ్యారు. బీఎల్‌ఓల పనితీరు, పోలింగ్ కేంద్రాల ఏర్పాటుపై ఆరాతీశారు. అర్హులైన వారు ఓటుహక్కును వినియోగించుకునేలా అవకాశం కల్పించాలని సూచించారు. అనంతరం చౌదర్‌పల్లి, గాధిర్యాల్ పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ తహసీల్దార్ యేసయ్య, డీటీ చంద్రశేఖర్, ఆర్‌ఐ యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

దేవరకద్ర: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆదివారం దేవరకద్ర మండలంలోని అన్ని పోలింగ్ బూత్‌లలో ప్రత్యేక క్యాంపేయిన్ నిర్వహించారు. తహసీల్దార్ శ్రీనివాస్, డీటీ ఆంజనేయులు పలు పోలింగ్ కేంద్రాలను తనిఖీలు చేశారు.

గండేడ్: ఓటర్ల జాబితాలో చనిపోయినవారి పేర్లు పక్కా ఆధారాలతోనే తొలగించాలని ఆర్డీఓ విజయకుమారి అన్నారు. ఆదివారం కొంరెడ్డిపల్లి పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. తహసీల్దార్ నాగలక్ష్మి తదితరులు ఉన్నారు.

గండేడ్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఓటర్ల నమోదు, సవరణలు కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగానే వివిధ గ్రామాలకు చెందిన 37 మంది బీఎల్‌ఓలకు ఓటర్ నమోదు కిట్లను ఆదివారం డిప్యూటీ తహసీల్దార్ ఇంతియాజ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఆర్‌ఐ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

నవాబుపేట: కొత్త ఓటర్ల నమోదుకు సంబంధించిన రెండు రోజుల డ్రైవ్‌లో 237 మంది ఫారం 8 అందించారని తహసీల్దార్ మల్లికార్జున్‌రావు ఆదివారం తెలిపారు.

ఉద్యమ పింఛన్ ఇవ్వాలి

స్టేషన్ మహబూబ్‌నగర్: తెలంగాణ పోరాట చరిత్రను ప్రభుత్వ సాంఘికశాస్త్ర పుస్తకం లో పొందుపరచాలని అల్‌ఫైజ్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు జహంగీర్‌బాబా ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో ఎంతో మంది కులమతాలకతీతంగా పాల్గొన్నట్లు తెలిపారు. అదేవిధంగా 75 ఏళ్ల సీనియర్ సిటిజన్లకు రూ.5వేల తెలంగాణ ఉద్యమ పింఛన్ ఇవ్వాలని, యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ ఉద్యమంలో ప్రముఖపాత్ర పోషించిన ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే ప్రక్రియను ప్రారంభించినందుకు సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు.

జడ్చర్లలో ర్యాపిడ్ ఫోర్స్ కవాతు



జడ్చర్ల: ప్రజల రక్షణకు తామున్నామని, ఎవరికీ భయపడవద్దని, ఎన్నికల సమయంలో ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని స్థానిక సీఐ రమేశ్‌బాబు అన్నారు. ఆదివారం నిమ్మబాయి గడ్డ నుంచి కావేరమ్మపేట వరకు 99వ బెటాలియన్ రాపిడ్‌ఫోర్స్ కవాతు నిర్వహించారు. ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ శ్రీకాంత్, ఇన్‌స్పెక్టర్లు కేకే చంద్ర, డీఎస్ మాకర్, ఎస్‌ఐ చంద్రమోహన్ పాల్గొన్నారు.

కళ్లకు గంతలు కట్టుకొని నిరసన



మహబూబ్‌నగర్ న్యూటౌన్: నేషనల్ హెల్త్ మిషన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని ఎన్‌హెచ్‌యం ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నవీన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్ డిమాండ్ చేశారు. మూడోరోజు కళ్లకు గంతలు కట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వెంకటేష్, ఏఐటీయూసీ రామ్మోహన్ పాల్గొన్నారు.

గణిత విజ్ఞాన మేళా



స్టేషన్ మహబూబ్‌నగర్: జిల్లా కేంద్రం బండమీదిపల్లిలోని శ్రీసరస్వతి శిశుమందిరంలో ఆదివారం గణిత విజ్ఞాన సాంస్కృతిక మేళా నిర్వహించారు. సరస్వతి విద్యాపీఠం పాలమూరు విభాగ్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు. పాలమూరు యూనివర్సిటీ ప్రొఫెసర్ పిండి పవన్‌కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. విద్యార్థులు గణితంపై పట్టుసాధించి విషయ పరిజ్ఞానాన్ని అలవర్చుకోవాలన్నారు. విభాగ్ ఉపాధ్యక్షుడు మద్ది అనంతరెడ్డి, వీరన్నపేట పాఠశాల అధ్యక్షుడు శ్రీరాంరెడ్డి, పాఠశాల కార్యదర్శి కె.శ్రీనివాసులు, మేకల సుదర్శన్, రాజమల్లేష్, వేణుగోపాల్, బాల్‌రాజు, శివశంకర్, యుగేంధర్‌రెడ్డి, కందూరు బాల్‌రాజు, చంద్రశేఖర్‌గుప్త తదితరులు పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



మహబూబ్‌నగర్ క్రీడలు: నారాయణపేటలో ఆదివారం డ్రాగన్ షోటోకాన్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయస్థాయి కరాటే పోటీల్లో జిల్లా కేంద్రంలోని శ్రీహనుమాన్ కరాటే అసోసియేషన్ విద్యార్థులు ప్రతిభచాటి పతకాలు సాధించినట్లు ఫౌండర్ కె.వెంకటేష్ తెలిపారు. ఈ పోటీల్లో అండర్–14 విభాగం కటాస్‌లో గణేష్, అండర్–8 విభాగం కటాస్‌లో వరుణ్‌తేజ ప్రథమ స్థానంలో నిలిచారని వివరించారు.

ధరలు తగ్గించాలని ధర్నా

గండీడ్: పెరిగిన పెట్రోలు, డీజిల్‌తోపాటు నిత్యావసర వస్తువుల ధరలు వెంటనే తగ్గించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మయ్య, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కురుమయ్య పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ధర్నా చేపట్టారు. ఇటీవల ధరలు విపరీతంగా పెరిగి సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయన్నారు. ధరలు పెంచి దేశసంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని వారు విమర్శించారు. సీఐటీయూ జిల్లా నాయకుడు భీమయ్య, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు మహేందర్ తదితరులు పాల్గొన్నారు.



గండేడ్‌లో ధర్నా చేస్తున్న నాయకులు

బీసీలకు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలి



మాట్లాడుతున్న రామాంజనేయులుగౌడ్

మహబూబ్‌నగర్ రూరల్: రాజకీయ పార్టీలన్నీ బీసీ నాయకులకు అసెంబ్లీ టికెట్లు కేటాయించాలని ఐక్య వేదిక తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.రామాంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. టికెట్లు ఇవ్వకుంటే పార్టీలను రాజకీయ సమాధి చేయడానికి బీసీ ప్రజానీకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఆదివారం టీఎన్జీఓ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. జనాభా దామాషా ప్రకారం స్థానాలను కేటాయించాలని అన్నారు. 23 టికెట్లు కేటాయించి బీఆర్‌ఎస్ బీసీ వ్యతిరేక పార్టీగా నిలిచిందని పేర్కొన్నారు. టికెట్లు ఇవ్వని పార్టీల ఓటమే లక్ష్యంగా పని చేస్తామని హెచ్చరించారు. ఐక్యవేదిక రాష్ట్ర కోశాధికారి జి.రంగప్పయాదవ్, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కె.రాజు ప్రజాపతి, ప్రధాన కార్యదర్శి లింగంగౌడ్, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, నాయకులు పాల్గొన్నారు.

తామరతో విద్యార్థుల అవస్థలు

- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న నంచర్ల గురుకుల సిబ్బంది



నంచర్ల గురుకుల పాఠశాల

మహమ్మదాబాద్: నంచర్ల గురుకుల విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై తల్లిదండ్రులు తీవ్రఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సిబ్బంది పౌష్టికాహారం అందించడం, ఆరోగ్యచర్యలు పాటించడంలో నిర్లక్ష్యంగా వ్యహరిస్తుండడంతో విద్యార్థులు గజ్జి, తామరతో అవస్థలు పడుతున్నారని వాపోతున్నారు. వివరాలు ఇలాఉన్నాయి.. బల్సూర్‌గొండ తండాకు చెందిన విద్యార్థి వెన్నెల పాఠశాలలో 6వ తరగతి చదువుతున్నది. పదిరోజులుగా తీవ్రమైన గజ్జి, తామరతో బాధపడుతోంది. పాఠశాలలో ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థిని తండ్రి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రిన్సిపాల్‌కు లెటర్ పెట్టాడు. కాగా తమ కుమార్తెను గజ్జి, తామర ఎక్కువయ్యిందని దయచేసి పంపించాలని వేడుకున్నా సంబంధిత ప్రిన్సిపల్, హెల్త్ అసిస్టెంట్ కూడా స్పందించలేదన్నారు. చివరకు నాలుగురోజుల అనంతరం పంపించారని, అప్పటికే చీము రక్తం వస్తూ తమ కుమార్తె బాధపడుతోందని వాపోయారు. విషయంపై కలెక్టరుకు ఫిర్యాదు చేస్తానని తెలిపారు. ఆదివారం పాఠశాలకు వెళ్లి పరిశీలించగా మరో 50 మంది విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలిసింది. పౌష్టికాహారం ఇవ్వకపోవడం, ఆరోగ్యం పట్ల పాఠశాలలోని ఏఎన్‌ఎం నిర్లక్ష్యం వహించడంతో ఇలాంటి పరిస్థితి తలెత్తిందని తల్లిదండ్రులు తెల్పుతున్నారు. సౌకర్యాలు సరిగా లేవని అంటున్నారు. నిర్లక్ష్యం వహించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. విషయమై ప్రిన్సిపాల్ వెంకటమ్మను వివరణ కోరగా విద్యార్థినులు అలాంటి విషయాలు తమకు చెప్పలేదని ఇకముందు పునరావృతం కాకుండా చూసుకుంటామని తెలిపారు.



ఇంటివద్ద చికిత్స పొందుతున్న విద్యార్థిని

పనితీరు ఆధారంగానే నివేదికలు



జమాల్‌పూర్‌లో అధికారులు

కోయిల్‌కొండ: గ్రామాలలో జూనియర్ గ్రామపంచాయతీ కార్యదర్శులు తమ పనితీరును మెరుగుపరుచుకోవడం ద్వారా రెగ్యులరైజేషన్ అవకాశం ఉంటుందని అదనపు కలెక్టర్ యాదయ్య అన్నారు. ఆదివారం జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లుతో కలిసి ఆయన మండలంలోని వివిధ గ్రామాల్లో జూనియర్ కార్యదర్శుల పనితీరు గురించి ఆరాతీశారు. పనితీరు ఆధారంగానే నివేదికలు పంపిస్తామన్నారు. ఫారెస్ట్‌రేంజ్ ఆఫీసర్ మగ్దుమ్, ఎంపీడీఓ జయరాములు, జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటుకు ధీటుగా ప్రభుత్వబడులు

- పొన్నకల్ పాఠశాలలో కార్పొరేట్ వసతులు
- 8,9,10 తరగతులకు స్మార్ట్ క్లాస్‌లు
- మన ఊరు– మన బడితో మెరుగైన సౌకర్యాలు



స్క్రీన్‌పై చూపిస్తూ బోధన చేస్తున్న ఉపాధ్యాయుడు

అడ్డాకుల: మండలంలోని పొన్నకల్‌లో ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా సర్కారు బడిని తీర్చిదిద్దారు. అధునాతన సౌకర్యలతో విద్యా బోధన చేస్తున్నారు. విద్యార్థులకు కావాల్సిన అన్ని సౌకర్యాలను సమకూర్చడంతో కార్పొరేట్ పాఠశాలల్లో కనిపించే వసతులు ఇక్కడ ఏర్పాటయ్యాయి. 2022 మార్చి 9న ప్రభుత్వం మన ఊరు– మన బడి కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి మొదటి విడతలో పొన్నకల్ పాఠశాలలను ఎంపిక చేయించడంతో మంజూరైన రూ.1.10కోట్లతో ప్రాథమిక, హైస్కూల్ బడుల రూపురేఖలే మారిపోయాయి. రెండు బడులను సుందరంగా తీర్చిదిద్దారు.

స్మార్ట్ తరగతులు..!

పొన్నకల్ ప్రాథమిక పాఠశాలలో 112 మంది, హైస్కూల్‌లో 157 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో హైస్కూల్‌కు 9 తరగతి గదులు అందుబాటులో ఉన్నాయి. వీటిలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు మన ఊరు మన బడి కింద స్మార్ట్‌క్లాస్‌ల కోసం ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పీ) పేరిట బహుళ ప్రయోజనాలతో కూడిన 75 అంగులాల స్క్రీన్లను ఏర్పాటు చేశారు. బ్లాక్ బోర్డుల స్థానంలో గ్రీన్‌చాక్ బోర్డులను అమర్చారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను తెరపై ప్రదర్శిస్తూ గ్రీన్‌చాక్ బోర్డుపై రాసి వివరించేటటువంటి సౌకర్యాలను ఏర్పాటు చేశారు. పెన్‌డ్రైవ్‌లో పాఠ్యాంశాలను అప్‌లోడ్ చేసుకుని అవసరమైనప్పుడు వాటిని వాడుకుని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు. అన్ని తరగతి గదుల్లో విద్యార్థులు కూర్చోవడానికి కార్పొరేట్ స్థాయి ఫర్నిచర్‌ను ఏర్పాటు చేశారు.

అదేవిధంగా పాఠశాల ఆవరణలోనే ఓ పెద్ద గదిలో గ్రంథాలయం ఏర్పాటు చేశారు. గ్రామస్తుల ఆర్థిక సాయంతో గ్రంథాలయంలో కావాల్సిన వసతులు, పుస్తకాలను ఏర్పాటు చేశారు. అదేవిధంగా మన ఊరు– మన బడి కింద సౌకర్యవంతమైన డైనింగ్ హాలు, నూతన కిచెన్ షెడ్‌లతో పాటు, టాయ్‌లెట్స్ వంటివి ఏర్పాటు చేశారు. ఈ ఏడాది ఫిబ్రవరి 1న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వసతులను ప్రారంభించారు. కాగా ఎంపీపీ నాగార్జున్‌రెడ్డి, స్థానిక సర్పంచ్ కల్పన సహకారంతో స్థానిక రెన్యూ పవర్ సోలార్ విద్యుత్ సంస్థ ద్వారా పాఠశాలకు ఉచితంగా సోలార్ పలకలు, నీటిశుద్ధి యంత్రాన్ని ఏర్పాటు చేయించారు.



గ్రంథాలయంలో చదువుకుంటున్న విద్యార్థులు

మెరుగైన బోధన



పాఠశాలకు కావాల్సిన అన్ని రకాల వసతులను సర్కారు ఏర్పాటు చేయించింది. స్మార్ట్ తరగతులతో పాటు గ్రంథాలయాన్ని అందుబాటులో ఉంచాం. మెరుగైన విద్యా బోధన విద్యార్థులకు అందుతున్నందున తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడికే పంపించాలి

–ఫయాజ్, హెచ్‌ఎం, పొన్నకల్

స్మార్ట్ తరగతులతో మేలు



మా పాఠశాలలో మన ఊరు– మన బడి ద్వారా 8, 9, 10 తరగతులకు స్మార్ట్ తరగతులను ఏర్పాటు చేశారు. పెద్ద స్క్రీన్‌పై వీడియోలను చూపిస్తూ డిజిటల్ క్లాసులను నిర్వహిస్తున్నారు. దీనివల్ల సులభంగా పాఠాలు అర్థమవుతున్నాయి.

–శివాని, 9వ తరగతి

సౌకర్యాలు బాగున్నాయి



మా బడిలో గత విద్యా సంవత్సరంలోనే అన్ని రకాల సౌకర్యాలను కల్పించారు. డిజిటల్ తరగతులు ఏర్పాటు చేసి డైనింగ్ హాలు, కిచెన్ షెడ్ నిర్మించారు. మరుగుదొడ్ల వసతిని మెరుగు పర్చారు. కార్పొరేట్ బడిలా తీర్చిదిద్దడం చాలా బాగుంది.

–వర్షిత్, 10వ తరగతి